క్లుప్తంగా

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో షబ్బీర్అలీ విజయానికి కృషి చేయాలని, కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ఇతరులకు తెలియజేయాలని కోరారు. నాయకులు పాక రవిప్రసాద్, వార్డు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రజలు కళ్లకలక వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని పీహెచ్సీ వైద్యురాలు హిమబిందు ఆదివారం సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రజలకు కళ్లకలక వ్యాధి వ్యాపిస్తుందన్నారు.చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లను తాకినప్పుడు బ్యాక్టీరియా కళ్లలోకి చేరి వ్యాధి బారిన పడుతున్నారన్నారు. కళ్లకలక వచ్చిన వారికి కళ్లు ఎరుపెక్కి, నీరు కారడం, దురదగా ఉండడం వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. నివారణతో పాటు ముందు జాగ్రత్తగా నీళ్లు కాచి, చల్లార్చి దూదితో కళ్లను తుడుచుకోవాలి. చేతులు తరుచూ సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఉతికిన టవల్స్, చేతి రుమాళ్లను మాత్రమే వాడాలన్నారు. కళ్లలో విపరీతమైన దురద, మంట ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలన్నారు.

అందుబాటులో యూరియా



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు యూరియా అందుబాటులో ఉంచినట్లు చైర్మన్ దేవేందర్రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే చెరుకు తోటలు, మొక్కజొన్న, సోయా, చిరుదాన్యాల పంటలకు అవసరమైన రైతులు యురియా తీసుకెళ్లాలని సూచించారు. మండల కేంద్రంలోని గోదాంలో 2100 బస్తాల యూరియాతో పాటు ఆయా గ్రామాల్లోని మినీ గోదాంలలో మరో 1400 బస్తాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ పట్టా పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు అందజేసి యూరియా తీసుకెళ్లాలన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో సోమవారం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశువైద్యుడు డాక్టర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచితంగా టీకాలు వేస్తామన్నారు.

ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మ దహనం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మను జెడ్పీటీసీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు దహనం చేశారు. ఎంపీ లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్ రద్దు చేయాలని మాట్లాడినందుకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

నటేశ్వరశర్మకు సన్మానం



కామారెడ్డి అర్బన్: దాశరథి కృష్ణమాచార్య-2023 అవార్డు పొందిన కామారెడ్డికి చెందిన కవి, రచయిత, అష్టావధాని డాక్టర అయాచితం నటేశ్వరశర్మను పట్టణంలోని లక్ష్మిగణపతి రెసిడెన్సీ వాసులు ఆదివారం సన్మానించారు. కౌన్సిలర్ ముప్పారపు అపర్ణ, ఆనంద్, కైలాస్ లక్ష్మణ్, బాల్రెడ్డి, ముత్యపు చక్రపాణి, సంతోష్, రమేష్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ గ్రామంలో మాజీ సర్పంచ్ పోతరాజు తులసమ్మ(80) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.1988 సంవత్సరం నుంచి 1996 వరకు ఆమె గ్రామ సర్పంచ్గా కొనసాగారన్నారు. ఆమె అంత్యక్రియలు దేమికలాన్లో ఆదివారం జరిగాయని తెలిపారు.

శిథిల 'బడి'





దన్నూర్ పాఠశాలలో కుంగిన మెట్లకు సపోర్ట్గా పెట్టిన బెంచ్.. కూలిన టాయిలెట్ గోడ



బీటలు వారిన భవనపు గోడలు

- ప్రమాదకరంగా దన్నూర్ ప్రభుత్వ పాఠశాల
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- భయాందోళనలో విద్యార్థులు

మద్నూర్(జుక్కల్): ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో చెందుతున్నారు. ఈ దుస్థితి మండలంలోని దన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో నెలకొంది. ప్రభుత్వ బడులకు రూ. కోట్ల నిధులు వెచ్చించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. మారుమూల గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దన్నూర్ పాఠశాల దుస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో పాఠశాలను బాగు చేసే వరకు తమ పిల్లలను బడికి పంపేది లేదంటు పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుబయటే తరగతులు..

దన్నూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు 46 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇదే పాఠశాలలోని ఒక గదిలో అంగన్వాడీ కేంద్రం కొనసాగుతుంది. అంగన్వాడీలో 22 మంది చిన్నారులు ఉన్నారు. ఈ పాఠశాలకు ఆనుకోని ప్రతి వర్షాకాలంలో వాగు నిండుగా ప్రవహిస్తోంది. దీంతో పాఠశాల పునాదిలో పగుళ్లు ఏర్పడి భవనానికి బీటలు వారి ప్రమాదకరంగా మారింది. పాఠశాల భవనం మెట్లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో విద్యార్థులకు తరగతి గది బయటే చదువు చెబుతున్నారు. అంతేకాకుండ వాగు, పొలాలు పక్కనే ఉండడంతో పాములు, విష కీటకాలు సైతం పాఠశాలలోకి వస్తున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటు తరగతులు కొనసాగిస్తున్నారు.

కూలిన గోడ.. విద్యార్థికి గాయాలు..

ఈ నెల 4న పాఠశాలకు ఆనుకోని ఉన్న టాయిలెట్ లోకి విద్యార్థులు వెళ్లారు. పిల్లలు బయటకు వచ్చే సమయంలో టాయిలెట్ గోడ ఒక్కసారిగా కూలిపోయింది. అక్కడే ఉన్న దినేష్ అనే విద్యార్థి కాళ్లపై ఇటుకలు, సిమెంట్ దిమ్మెలు పడ్డాయి. ఉపాధ్యాయులు హుటాహుటిన వెళ్లి, దినేష్ను ఆస్పత్రికి తరలించారు. దినేష్ రెండు కాళ్లు విరిగాయని అందులో ఒక కాలిలోని ఎముకలు ముక్కలు ముక్కలయ్యాయని వైద్యులు తెలిపారని బాలుడి తండ్రి మధుకర్ వాపోయాడు. ఈక్రమంలో పాఠశాల ప్రమాదకరంగా మారడంతో 46మంది విద్యార్థులకు గాను 15మంది విద్యార్థులే హాజరవుతున్నారని, మిగిలిన పిల్లలు రావడం లేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పాఠశాలకు నూతన భవనం నిర్మించి, సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చాలా భయంగా ఉంది..



పాఠశాలలో చదవాలంటే చాలా భయంగా ఉంది. పాఠశాలలో మొన్న గోడ కూలింది. మమ్మల్ని పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. చాలా ఇబ్బంది పడుతున్నాం.

–దయానంద్, 5వ తరగతి, దన్నూర్

అధికారులు పట్టించుకోవాలి..



మా గ్రామంలోని పాఠశాలలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ మధ్యనే గోడ కూలింది. ఇప్పటివరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు రాలేరు. పాఠశాల గోడలు పగుళ్లు ఏర్పడి, ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించాలి.

–శివాజీ, గ్రామస్తుడు, దన్నూర్

ఉన్నతాధికారులకు విన్నవించాం..



పాఠశాలలో సమస్యలు ఉన్నాయని గత ఆరు నెలల కిందటే ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. పాఠశాల భవనానికి పగుళ్లు ఏర్పడి ఒక వైపుకు వంగిపోయింది. ఆరుబయటే విద్యార్థులకు తరగతులు కొనసాగిస్తున్నాం.

–ప్రకాశ్, హెచ్ఎం, దన్నూర్

పాఠశాలను తరలిస్తాం..

దన్నూర్ పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో పక్కన ఉన్న గ్రామపంచాయతీ భవనంలోకి పాఠశాలను తరలించాలని చూస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు దన్నూర్ పాఠశాలలో సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేశాం.

–రాములు, ఎంఈవో, మద్నూర్

దళితుల అభివృద్ధికి కృషి చేస్తా

- స్పీకర్ పోచారం శ్రీనివాస్రెడ్డి
- బాన్సువాడ దళితవాడలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



దళితవాడలో పార్కును ప్రారంభిస్తున్న స్పీకర్

బాన్సువాడ: బాన్సువాడ దళితులతో 1978 నుంచి తనకు అనుబంధం ఉందని, వారికి సేవ చేయడం తన బాధ్యత అని, వారి అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్రెడ్డి అన్నారు. పట్టణంలోని దళితవాడలో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక కావాల్సిన నిధులు మంజూరు అవుతున్నాయని, దళితవాడలో అవరమైన నిధులు మంజురు చేశానని అన్నారు. రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇళ్లు అత్యధికంగా మంజూరైన నియోజకవర్గం బాన్సువాడ అని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11వేల డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు అంజిరెడి, కృష్ణరెడ్డి, శ్రీధర్, ఎజాస్, మోహన్నాయక్, దొన్కంటి వెంకటి, నర్సగొండ, లింగం, రమాదేవి, అనిత, రుక్మిణి, వసజ తదితరులు ఉన్నారు.

కుల వృత్తులను ప్రోత్సహిస్తాం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న విప్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్

రామారెడ్డి(ఎల్లారెడ్డి): కుల వృత్తులను కాపాడి వారిని ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా బలోపేతం చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రెడ్డిపేట గౌడసంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కుల సంఘ భవనానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తానని చెప్పినట్లుగా ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గర్గుల్ రాజాగౌడ్ తెలిపారు. సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 4లక్షల నిధుల ప్రొసీడింగ్సు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి అందజేశారు.

ఎలక్ట్రికల్ ఆటో అందజేత..

కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన భాస్కర్ మల్లవ్వ స్త్రీనిధి నుంచి ఎలక్ట్రికల్ ఆటోను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అందజేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, ఇన్చార్జి ఎంపీపీ నరేష్, సర్పంచ్ రవితేజగౌడ్, స్త్రీనిధి చైర్మన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఆదివారం పలు గ్రామాలకు చెందిన సుమారు 40 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.30లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,057 మందికి రూ.12,44,53,700 ఆర్థికసాయం అందజేశామన్నారు. బాధితులు ఆస్పత్రుల్లో చేయించుకున్న వైద్య చికిత్స పత్రాలను తమ కార్యాలయంలో ఇస్తే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, నల్లవెల్లి అశోక్, జూకంటి ప్రభాకర్రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన





తాడ్వాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు.. నాగిరెడ్డిపేటలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం సైబర్ మోసాలపై ప్రజలకు ఎస్సై ఆంజనేయులు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే మోసపూరితమైన ఫోన్కాల్స్ను నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే 100 నంబరుకు సమాచారాన్ని అందించాలని సూచించారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో ఆదివారం ప్రజలకు ఏఎస్సై లచ్చిరాం కమ్యూనిటీ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు చేసే మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

బాన్సువాడలో వైద్య శిబిరం

బాన్సువాడ: పట్టణంలో ఆదివారం లయన్స్ క్లబ్ బాన్సువాడ, మెడికవర్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు 300 మందికి వివిధ చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 450 రోగులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దుద్దాల అంజిరెడ్డి, కాచం శ్రీనివాస్, భూనేకర్ ప్రకాష్, వెంకటరమణ, లక్ష్మారెడ్డి, భూపతిరావు, జగన్మోహన్రావు ఉన్నారు.

దాతకు సన్మానం



భిక్కనూరు: మండలంలోని సిద్దరామేశ్వరాలయ అభివృద్ధి కోసం బిచ్కుందకు చెందిన ఎం కృష్ణమూర్తి-చంద్రకళ దంపతులు ఆదివారం రూ.11,116 విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ పాలక మండలి చైర్మన్ మహేందర్రెడ్డి వారిని సన్మానించారు.

మల్లన్న కమ్యూనిటీ హాల్కు రూ.11 లక్షల విరాళం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి మల్లన్న ఆలయం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన శివభక్త కమిటీ 11లక్షల నూటపదహారు రూపాయలు విరాళం అందజేసింది. భక్తులకు సౌకర్యవంతంగా హాల్ నిర్మించాలని వారు సూచించారు.

మన్కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నేతలు



ఎల్లారెడ్డిలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు



చిన్నమల్లారెడ్డి గ్రామంలో..

ఎల్లారెడ్డి/కామారెడ్డి రూరల్/తాడ్వాయి(ఎల్లారెడ్డి): జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్, బాలరాజు, సతీష్, వెంకట్రావు,లింగారావు, రవిందర్రావు, నందు, శ్యాంసుందర్, బాలక్రిష్ణ, రాకేష్, ప్రవీన్,గణేష్ తదితరులున్నారు. అంతకుముందు కామారెడ్డి మండలం శాబ్దిపూర్ తండాలో సేవాలాల్ ఆలయ ఆవరణలో గ్రానైట్ పనులను కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు.

తెగిన రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షాలకు తెగిపోయింది. తెగిన రోడ్డుకు ఆదివారం అధికారులు మరమ్మతులు చేయించారు. దీంతో నాలుగు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు ప్రారంభమయ్యాయి.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె





ఇబ్రాహింపేట్లో సమ్మె నిర్వహిస్తున్న జీపీ కార్మికులు.. భిక్కనూరు మండల కేంద్రంలో..

బాన్సువాడ రూరల్/భిక్కనూరు/దోమకొండ/పిట్లం(జుక్కల్): జిల్లాలోని పలు మండలాల్లో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 25వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. దోమకొండలో కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపి, ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ మంత్రి షబ్బీర్అలీ ఆదేశాల మేరకు కార్మికులకు మద్దతు ఇచ్చి వంటావార్పులో పాల్గొన్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.



పిట్లం మండల కేంద్రంలో..



దోమకొండలో వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు

నష్టపరిహారం అందజేత



నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న నాయకులు

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామంలో కామటి రాజయ్యకు చెందిన ఆవు గతేడాది విద్యుత్ షాక్తో మృతిచెందింది. ఆదివారం విద్యుత్ అధికారులు రాజయ్యకు నష్టపరిహారం కింద నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధ రూ.40వేల చెక్కును అందజేశారు. ట్రాన్స్కో ఏడీ కిరణ్చైతన్య,జెడ్పీవైస్చైర్మన్ ప్రేంకుమార్ ఉన్నారు.

సమాచారం..



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని చెరువు కట్ట శివాలయంలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మధు సుదనానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో ఆ లయంలో లక్షపత్రి పూజ, మాహ రుద్రం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి ఉదయం నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ పూజారి గంగన్న తెలిపారు.

సంక్షిప్తం

పురాతన పాఠశాల భవనం కూల్చివేత



రాజంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శిథిలావస్థలో ఉన్న భవనాన్ని ఆదివారం కూల్చివేశారు. సర్పంచ్ సౌమ్య, ఉప సర్పంచి శివకుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన (పోలీస్ కానిస్టేబుల్) ఏలేటి నరేష్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ, ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో ఎంపీటీసీ ఉమాదేవి చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం కొనసాగించారు. అన్నాసాగర్ ఎంపీటీసీ పరిధిలోని సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు దీక్షను కొనసాగిస్తానని ఆమె అన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పరిహారం చెల్లించని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

పిట్లంలో అన్నదానం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ డాక్టర్ బాబురావు జన్మ దిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. క్లబ్ సభ్యులు వేణుగోపాల్, నారాయణరెడ్డి. లక్ష్మీనారాయణ, రాజు, శుభర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పెరక సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రి గోపాల్ ఆదివారం తెలిపారు. అలాగే పెరిక సంఘంకు రూ. లక్షతో బోరుబావి, మోటారు మంజూరు చేశారన్నారు. దీంతో ప్రభుత్వ విప్కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామసభలో లబ్ధిదారులను ఎంపికచేయాలి

రామారెడ్డి (ఎల్లారెడ్డి): సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ఏ విధంగా లబ్ధి చేకూరుస్తారో విధివిధానాలను ప్రకటించాలని, లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలోనే జరగాలని పోసానిపేట సర్పంచ్ మహేందర్రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గ్రామంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు సొంత స్థలాలు ఉన్నవాళ్లు ఇల్లు నిర్మించుకుంటే రూ. మూడు లక్షలు ఇస్తామంటున్నారన్నారు. ముందుగా ఇల్లు కూలిపోయిన వాళ్లకు ప్రాధాన్యత ఇచ్చి తీర్మానం చేయించిన తర్వాతనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు.